క్లుప్తంగా

లేపాక్షి ఆలయ సందర్శన



కమిషనర్ దంపతులను సత్కరిస్తున్న అర్చకులు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం కర్ణాటకలోని బెంగళూరు ఆదాయ పన్ను శాఖ కమిషనర్ విలాస్ షిండే ఐఆర్ఎస్ దంపతులు సందర్శించారు. వీరికి అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. అనంతరం ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాముల వారికి పూజలు చేశారు. అర్చకులు వారిని పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఎంపీడీఓ నరసింహమూర్తితో పాటు ఉపాధి, రెవెన్యూ సిబ్బంది వారి వెంట ఉన్నారు.

చేపల చెరువు వేలం వాయిదా

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి సోమవారం నిర్వహించాల్సిన వేలం పాట అనివార్య కారణాలతో వాయిదా పడిందని గ్రామ కార్యదర్శి అశ్వత్థరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాట నిర్వహించే తేదీని మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు. వాయిదా పడిన విషయాన్ని వ్యాపారస్తులు గమనించాలని కోరారు.

గురునానక్, గురుగోవింద్ సింగ్ జయంత్యుత్సవాలు



పండ్లు, స్వీట్లను పంపిణీ చేస్తున్న సిక్కులు

హిందూపురం టౌన్: సిక్కు గురువులు గురునానక్ జీ, గురుగోవిండ్‌సింగ్ జయంత్యుత్సవాలను ఆదివారం సిఖ్ సత్ సంగత్ ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇందాద్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి, అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ హాజరయ్యారు. వక్తలు మాట్లాడుతూ అన్నిమతాల వారు ఐకమత్యంతో మనుగడ సాగించాలన్నారు. అనంతరం సిక్కులు పండ్లు ఫలహారాలు, స్వీట్లను పంచి పెట్టారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉదయ్ కుమార్, మింటూ మనోజ్, సిక్కులు పల్విందర్ సింగ్, ఓంకార్ సింగ్, భగవాన్ సింగ్, షేక్ షబ్బీర్, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెనుకొండ రూరల్: గొందిపల్లి రెవెన్యూ పొలంలో ఉన్న వ్యర్థాలను అధికారులు తొలగింపజేశారు. గొందిపల్లి పొలంలో కియా పరిశ్రమ నుంచి వెలువడిన వ్యర్థాలపై ఈనెల 14న కుప్పలు తెప్పలుగా వ్యర్థాలు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు వ్యర్థాలతోపాటు చెత్తను తొలగించారు.

మాలల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

మడకశిర: రాష్ట్ర వ్యాప్తంగా మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ కుమార్ తెలిపారు. ఆదివారం మడకశిరకు వచ్చిన ఆయన.. నియోజకవర్గంలోని మాల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాలసంఘం నాయకులు పలు సమ్యలను విన్నవించారు. ప్రభుత్వం మాలల సమస్యలను పరిష్కరించడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ కుమార్ తెలిపారు. సమావేశంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, మాల మహానాడు నాయకులు కోట్ల గంగాధర్,డాక్టర్ ముత్యాలప్ప, ముత్యాలు, పూలకుంట మూర్తి, బసవ రాజు, సోమకుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధమ్మ, పాండురంగప్ప పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా వెంకటేష్

చిలమత్తూరు: మండల ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా వెంకటేష్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. హిందూపురంలో పనిచేస్తున్న వెంకటేష్‌కు చిలమత్తూరు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక్కడ ఎఫ్ఏసీగా పనిచేస్తున్న యూనిస్‌బాబు తిరిగి రీసర్వే డీటీ బాధ్యతలు నిర్వహించనున్నారు. అయితే తహసీల్దార్‌ను ఎందుకు మార్చారన్న విషయంపై జోరుగా చర్చ సాగుతోంది.

విద్యుత్ కోతలు.. రైతుల వెతలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటల సాగులో రైతన్నలు అడుగడుగునా కష్టాలు ఎదుర్కొంటున్నారు. అగళి మండల వ్యాప్తంగా 3,200 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వ అలసత్వంతో రైతన్నలకు తొమ్మిది గంటలు సరఫరా అయ్యే విద్యుత్ వేళలను కుదించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు వచ్చాయి. తొమ్మిది గంటల పాటు ఇచ్చే విద్యుత్ 6 గంటలు, 7 గంటలు ఇస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటలు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా అవుతోంది. సక్రమంగా సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా చేయడం సరికాదని రైతులు మండిపడుతున్నారు.



విద్యుత్ కోతలు నివారించాలని పి.బ్యాడగేర సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

- అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు
- ఆందోళనలో అన్నదాతలు
- విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

అగళి: వేసవికాలం ప్రారంభం కాకనే గ్రామాల్లో కరెంట్ కోతలు మొదలయ్యాయి. గ్రామాల్లో పగటి పూటతో పాటు రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటోంది. రైతులతో పాటు గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో 5 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో పి.బ్యాడగేర, మధూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ అనధికార కోతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో 5 ఫీడర్లు కింద సుమారు 42 గ్రామాలు ఉన్నాయి. ఈ విద్యుత్ కోతల వల్ల రబీలో బోరు బావుల కింద పంటలు సాగు చేసిన రైతులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ కోతలను నివారించాలని కోరుతూ ఇటీవల చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులు, ప్రజలు పలుమార్లు సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు.

ఎందుకంత నిర్లక్ష్యం..

బ్యాడగేర, మధూడిలో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు ఫీడర్ల షిఫ్ట్ బ్రేకర్లు సరిగా పని చేయడం లేదు. దీంతో రైతుల మోటర్లు కాలిపోతున్నాయి. ఇక సబ్‌స్టేషన్ కింద ఉన్న బ్యాడగేర, మధూడిలోని ఫిడర్ కింద మోటర్లు, గ్రామాలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ ఓవర్ లోడ్‌తో సమస్యలు తలెత్తున్నాయని సమాచారం. సబ్‌స్టేషన్ పరిధిలో చాలాచోట్ల విద్యుత్ లైన్లు పాడై మరమ్మతులకు గురవుతుండటంతో సిబ్బంది ప్రతిసారి ఎల్‌సీలు తీసుకుంటున్నారు. దీంతో రైతు, గృహ వినియోగదారులకు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. అధికారులు స్పందించి కోతలు నివారించాలని రైతులు కోరుతున్నారు.

తొమ్మిది గంటలు ఇవ్వాలి



లో ఓల్టేజీ సమస్యతో వారానికి రెండు, మూడు సార్లు మోటార్లు కాలిపోతున్నాయి. ఇప్పటికే పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చులేక పోతున్నాం. మోటార్లు కాలిపోతుండటంతో వాటి మరమ్మతకు తిరిగి అప్పులు చేయాల్సి వస్తోంది. వేరుశనగ, ఉల్లి పైర్లకు నీటి తడులు ఎంతో అవసరం. ఈ దశలో నీరు అందించకపోతే పైరు ఎదుగుదల దెబ్బతింటుంది. తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వాల్సిందే.

– నరసింహ రాజు, గాయత్రీ కాలనీ, అగళి

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



అగళి, రొళ్ల మండలాల రైతుల విద్యుత్ కష్టాలు తీరాలంటే రెండు మండలాల పరిధిలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. లో ఓల్టేజ్, తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేయొచ్చు 132/33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయకపోతే రైతులకు విద్యుత్ కష్టాలు తప్పవు. లో ఓల్టేజ్ సమస్య తీరదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి.

– స్టూడియో శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

సమస్యలు పరిష్కరిస్తాం



అగళి మండల సబ్‌స్టేషన్‌లో సమస్యల వల్ల గ్రామాల్లో విద్యుత్ కోతలు వస్తున్నాయి. ప్రస్తుతానికి మడకశిర 132/33 స్టేషన్ నుంచి రొళ్లకు లైన్ ఏర్పాటు చేస్తున్నాం. రెండు మండలాల్లో ఒక్క చోట 132/33 సబ్ స్టేషన్ ఏర్పాటుకు చేయడానికి ప్రభుత్వానికి ఉన్నతాధికారులు నివేదికలు పంపించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– నాగన్న, విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏడీ, మడకశిర

25న పీఎల్‌డీ బ్యాంక్ ఎన్నికలు

పావగడ: స్థానిక పీఎల్‌డీ (ప్రాథమిక సహకార వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి) బ్యాంక్ ఎన్నికలు ఈనెల 25న జరగనున్నాయి. అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. 14 డైరెక్టర్ల స్థానాలకు 48 మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కసబ హోబళి-11, వైఎన్ హొసకోట హోబళి-9, నాగలమడక హోబళి-9, నిడుగల్ హోబళి-12 మంది అభ్యర్థులు, నాన్ బారోయింగ్ విభాగం నుంచి 7 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న నామినేషన్ల పరిశీలన, 19న నామినేషన్ల ఉపసంహరణ, 25న శనివారం ఎన్నికలు జరుగుతాయన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమికోన్నత బాలల పాఠశాల భవనంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఇదిలా వుంటే ఈ బ్యాంకు లో మొత్తం బారోయింగ్ ఓటర్లు 65 మంది ఉండగా.. నాన్ బారోయింగ్ ఓటర్లు 147 మంది ఉన్నారు. హోబళీ వారుగా చూస్తే కసబ హోబళి-33, నాగలమడక-41, వైఎన్ హొసకోట-47, నిడుగల్-26 మంది నాన్ బారోయింగ్ ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో జేడీఎస్ ఉండగా.. ఎలాగైనా గెలుస్తామనే ధీమాతో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ క్షేత్రం కైవారం తాతయ్య శిష్య బృంద సభ్యులు ఎమ్మెస్ రామయ్య, డాక్టర్ ఎంఆర్ జయరాం సహకారంతో హిందూపురం టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సేవాసమితి ప్రెసిడెంట్ రవిశంకర్, రాజ్యలక్ష్మి మోహన్, మహేష్,చంద్రమోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

నివాళి

పెనుకొండ రూరల్: అడదాకులపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మంజునాథ్ రెడ్డి, మాతృమూర్తి ఆదెమ్మ అనారోగ్యంతో బాధపడుతు శనివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ గ్రామానికి చేరుకుని ఆదెమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా జగన్‌పై విమర్శలా?

- తాము చేసిన ఛాలెంజ్‌కు మంత్రి సవిత పారిపోయారు
- 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'లో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



తురకలాపట్నంలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

రొద్దం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా వాటిపై ప్రశ్నిస్తే తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడమేంటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మంత్రి సవితపై మండిపడ్డారు. ఆదివారం ఉదయం తురకలాపట్నం గ్రామంలో 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్' కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఇప్పటి చంద్రబాబు ప్రభుత్వం పని తీరుపై అడిగి తెలుసుకున్నారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తాము సంతోషంగా ఉన్నామని, అప్పటి ప్రభుత్వంలోనే తమ కుటుంబాలకు మంచి జరిగిందని గ్రామస్తులు చెప్పారు. ఈసందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఎన్నో పథకాలను అమలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. తల్లికి వందనం పథకం కోసం విద్యార్థులు, తల్లులు ఎదురు చూస్తున్నారన్నారు. ఆ పథకం ఎందుకు అమలు చేయట్లేదో టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వచ్చి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

జగనన్నను విమర్శిస్తే చూస్తూ ఊరుకోం

సంక్రాంతి రోజు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై మంత్రి సవిత అనుచిత వాఖ్యలు చేసిందని మాజీ మంత్రి గుర్తు చేశారు. పండుగ రోజున కూడా జగనన్నపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కావాలని పదేపదే జగనన్నను విమర్శిస్తే వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులు గంజాయి, మద్యానికి బానిసలైనారని మంత్రి సవిత విమర్శలు చేశారన్నారు. అయితే ఆమె సొంత పంచాయతీలో ఒక్కరినైనా అలాంటి వారిని చూపాలని తాము చాలెంజ్ చేస్తే ఇప్పటిదాకా సమాధానం లేదని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వంలో అభద్రత

కూటమి ప్రభుత్వంలో అభద్రతా భావం ఏర్పడిందని మాజీ మంత్రి పేర్కొన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి రోజున టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి లోకేష్ యువనాయకుడని, ఆయన నాయకత్వం కావాలని.. ఆయన్ను డిప్యూటీ సీఎంగా తాను ప్రోపోజ్ చేస్తున్నట్లు ప్రకటించడమే దీనికి నిదర్శనమన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు కూడా ఓ టీవీ చానల్‌లో ఇదే మాట్లాడడం అందరం చూశామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఎక్కడ తమకంటే ముందుకు వెళ్తాడోనని అభ్రత భావం టీడీపీలో ఏర్పడిందన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు వారిలో వారు కుమ్ములాట పెట్టుకోకుండా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీటీసీలు మాధవి శ్రీనివాస్, శంకర్‌రెడ్డి, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, జిల్లా యాక్టివిటీ సెక్రటరీ నరేంద్రరెడ్డి, పెనుకొండ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ముఖ్య నాయకులు అక్కులప్ప, సి.నారాయణరెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, నరసింహులు, లక్ష్మినారాయణరెడ్డి, చిలకల రవి, గోపాల్ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబవ్వ ధైర్యసాహసాలు ఎనలేనివి



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి

గుడిబండ: చిత్రదుర్గ కోట సామంతరాజుల రాజ్యాన్ని శత్రు సైన్యం నుంచి కాపాడేందుకు విరోచిత పోరాటం చేసిన ఒణకే ఓబవ్వ ధైర్యసాహసాలు ఎనలేనివి. భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఓబవ్వవిగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని సీడబ్ల్యూసీ మెంబర్ రఘువీరారెడ్డి తెలిపారు. ఆదివారం మందలపల్లిలో మాలమహానాడు ఆధ్వర్యంలో వీరవనిత ఒణకే ఓబవ్వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత మాలకులస్తులు గ్రామ పుర వీధుల గుండా కళశాలతో ఊరేగింపు చేపట్టారు. చిన్నారులు ఒణకే ఓబవ్వ వేషధారణలో అలంరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. పల్నాడు సైనాధ్యక్షుడు మాలవీర కన్నమదాసు, ఓబవ్వ వంటి పోరాట వీరుల చరిత్రను తెలియజేసేందుకు నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో ఓబవ్వ జయంతి నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాల కార్పొరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్, కుంచిటి వక్కలిగ సంఘం తాలూకా అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, మాల మహానాడు తాలూకా అధ్యక్షుడు పాండురంగప్ప, కాంగ్రెస్ కన్వీనర్ నాగరాజు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజల్లో శృంగేరి పీఠం పీఠాధిపతి



రాజరాజేశ్వరీ ఆలయం వద్ద హోమంలో పాల్గొన్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామి

హిందూపురం: శృంగేరి పీఠం పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి ఆదివారం పులమతి రోడ్డులోని రాజ రాజేశ్వరీదేవి ఆలయంలో ధ్వజస్తంభ కుంభాభిషేకం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈసందర్భంగా స్వామి వారికి స్వాగతం పలికారు. ఆలయంలో విమాన గోపురం, శ్రీచక్ర, ధ్వజస్తంభ, మహా కుంభాభిషేకం, హోమ పూజల్లో ఆయన పాల్గొన్నారు. అలాగే భవానీ శంకర మఠంలో శారద అమ్మవారికి పూజాకార్యక్రమాలు చేపట్టారు. తర్వాత కోట కాశీవిశ్వేశ్వర ఆలయంలో నిర్వహించిన పూజలకు హాజయ్యారు. కార్యక్రమంలో బ్రహ్మణసేవా ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



హిందూపురంలో వేమన విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, రెడ్డి సంఘం, రాజకీయ నాయకులు



పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత చరణ్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు



మడకశిర: యోగి వేమన విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

హిందూపురం/సోమందేపల్లి/లేపాక్షి/మడకశిర/పెనుకొండ/పెనుకొండరూరల్/పరిగి/రొళ్ల/అగళి/పావగడ: విశ్వకవి యోగి వేమన జయంతి సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సంఘ సభ్యులందరూ పార్టీలకు అతీతంగా స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి సడ్లపల్లి వద్ద వేమన విగ్రహం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి మాట్లాడుతూ ఆత్మజ్ఞానం పొంది మానవజీవితాలకు సన్మార్గాన్ని చూపిన మహనీయుడు యోగి వేమన అన్నారు . అనంతరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షులు పరమేష్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, నాయకులు అశ్వర్థరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బిరెడ్డి,శివశంకర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

» హిందూపురం మండలంలోని చలివెందుల గ్రామంలో సర్పంచ్ ఉపేంద్రరెడ్డి ఆధ్యక్షతన యోగివేమన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు స్వామి రాజానంద గురూజీ, కొండూరు వేణుగోపాల్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు ధనాపురం వెంకట్రాంరెడ్డి, చైతన్య గంగిరెడ్డి, జడ్పీటీసి శ్రీనివాస్ రెడ్డి,బాలంపల్లి అశ్వత్థరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, బసిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, చలివెందల మజారా రెడ్డిసంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే త్రైత సిద్ధాంత ప్రబోధానంద స్వామి శిష్య బృందం, రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ముదిరెడ్డిపల్లి నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నాగ భూషణం రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, కౌన్సిలర్ చంద్ర, రెడ్డిసంఘ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి ముద్దిరెడ్డి పల్లి కమిటీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

» సోమందేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగమ్మ, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు లక్ష్మి రెడ్డి, రవీంద్ర రెడ్డి, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

» లేపాక్షి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రెడ్డి సంఘం నాయకులు యోగివేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, రెడ్డి సంఘం నాయకులు గంగిరెడ్డి రవీంద్రరెడ్డి, శ్యామ్‌ప్రసాదరెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబురెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, నరసింహ రెడ్డి, వేణురెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

» మడకశిర పట్టణంలో ఆదివారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనంద రంగారెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మీ నరసింహరెడ్డి, సుబ్బారెడ్డి, సతీష్ రెడ్డి, కేశవరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, నితిన్ రెడ్డి, వెంకటరంగారెడ్డి, నరేష్ రెడ్డి పాల్గొన్నారు.

» పెనుకొండ పట్టణంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రెడ్డి సంఘం నాయకులు స్థానిక పోస్టాఫీస్ వద్ద ఉన్న యోగి వేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన పద్యాలు సమాజానికి మార్గదర్శకాలన్నారు. కౌన్సిలర్ సుధాకరరెడ్డి, నాయకులు శ్రీకాంతరెడ్డి, మారుతిరెడ్డి, సుగుణాకరరెడ్డి, మహేష్‌రెడ్డి, జయశంకరరెడ్డి, మధుసూధనరెడ్డి, ప్రభాకరరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, లింగారెడ్డి, శంకరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోనిపేట రాజారెడ్డి, సోమశేఖరరెడ్డి, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

» పెనుకొండ మండలంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్ తదితరులు యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పించారు.

రెడ్డి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి సాయం

» పరిగి మండల కేంద్రంలో ఆదివారం యోగి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పెనుకొండ నియోజకవర్గంలో రెడ్డి కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి తన వంతు సాయం అందిస్తానని మాజీ మంత్రి, ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాలరెడ్డి, బసిరెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, రెడ్డి సంఘం రాష్ట్ర నేత గంగులకుంట నరేష్‌రెడ్డి, పుప్పం సుధాకర్‌రెడ్డి, వైశాలి జయశంకరరెడ్డి, బాబుల్‌రెడ్డి, సి నారాయణరెడ్డి, ఎస్ నారాయణరెడ్డి, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

» రొళ్ల తహసీల్దార్ కార్యాలయం, అగళి తహసీల్దార్ కార్యాలయంతోపాటు పావగడ తహసీల్దార్ కార్యాలయంలో యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు.

ఆర్‌ఎస్ఎస్ భారీ ర్యాలీ



హిందూపురం: హిందూపురం ఆర్ఎస్ఎస్ విభాగ్ పథ సంచలన్ మహిళా విభాగం రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో హిందూపురంలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర సేవికా సమితి అనంతపురం విభాగ్ పథ సంచలన్ నేతృత్వంలో మహిళలు శ్వేత వర్ణ దుస్తులతో కర్రలు (డండ) చేతపట్టి పట్టణంలోని ప్రధాన రహదారులు, ఎంఎఫ్ రోడ్,మెయిన్‌బజార్‌మీదుగా ర్యాలీ చేశారు. ప్రార్థనలు చేసి మేముసైతం దేశ పరిరక్షణలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

పరిగి: మోదా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాలు..బెంగళూరుకు చెందిన పళని(35) పెద్ద దాళవాటం వద్ద పొలం తీసుకుని పనులు చేయిస్తున్నాడు. శనివారం సాయంత్రం పనులు ముగించుకుని బెంగళూరుకు వెళ్లేందుకు మోదా నుంచి హిందూపురానికి ఆటోలో బయలుదేరాడు. స్టీల్ ఫ్యాక్టరీ వద్ద ఆటో డ్రైవర్ వేగంగా ఆటో నడపడంతో పళని ఆటోలో నుంచి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు మునిస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.